విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



సర్వేపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రభుత్వం చారిత్రాత్మకంగా, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమంపై రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ హెచ్చరించారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే మొదటి, రెండు దశల అమలుపై ఆర్ డి ఒ లు, తహశీల్దార్లు, సర్వేయర్లతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సమీక్షలో కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ రీ సర్వే చేసిన తర్వాత కొన్ని చోట్ల భూహక్కు పత్రాలు ఆ యజమానులకు కాకుండా వారి బంధువులకు ఇస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని అలా ఎందుకు ఇస్తున్నారని తహసిల్దార్లను ప్రశ్నించారు. సంబంధిత యజమానులకు మాత్రమే ఇవ్వాలని ఇతరులకు ఇవ్వవద్దని సూచించారు. రీ సర్వే చేసిన గ్రామాలలో ఎందుకు ఇలా జరుగుతున్నదో పరిశీలన చేసి అందుకు కారణాలను తెలుపుతూ నివేదిక ఇవ్వాలని ఆర్డీవోలను ఆదేశించారు. భూహక్కు పత్రాలకు సంబంధించి భూ యజమానుల ఫోటోలు అప్లోడ్ వేగవంతం చేయాలన్నారు సీసీఎల్ఏ నుండి ప్రగతి పై నివేదికలు కోరుతున్నందున మండల తమశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా పూర్తి చేయాలన్నారు. మిషన్ మోడ్ లో రీ సర్వే చేయవలసి ఉండగా సర్వే అధికారులు సక్రమంగా చేయడం లేదని, సర్వే నిర్వహణ సరిగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే జిల్లా అధికారి పనితీరుపై లాండ్ సర్వే ఉన్నత అధికారులకు లేఖ రాస్తామన్నారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి రావాలని

కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం.కూర్మనాథ్ మాట్లాడుతూ రీ సర్వే, సర్వే రాళ్ళ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని, వేసిన రాళ్లకు జియో టాకింగ్ చేయాలన్నారు. రీ సర్వే లో ఏవైనా పొరపాట్లు జరిగితే తహశీల్దార్లు భాధ్యత వహించ వలసి వుంటుందన్నారు. ఈ సమావేశంలో ఏడి ల్యాండ్ సర్వే ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పనులు వేగవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: నవరత్నా లు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వ త గృహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తి చేసిన గృహాలను లబ్దిదారులకు అందజేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్థానిక ఇనమడుగు లే అవుట్ జగనన్న కాలనీ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్దిదారుల భాగ స్వామ్యంతో నిర్మిస్తున్న గృహాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సచివా లయ అమెనిటీస్ కార్యదర్శులు లే అవుట్ల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్తు, వీధి దీపాలు, మంచినీరు, డ్రైన్లు, రోడ్డు మార్గాలు, పచ్చదనం వంటి మౌలిక సదుపాయాలను త్వరితగతిన కాంట్రాక్టర్లు కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో హౌసింగ్ కార్పొరేషన్ విభాగం అధికారి దయాకర్, సిబ్బంది, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయ వార్డు అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేయండి: ఆర్డబ్ల్యుసి

విశాలాంధ్ర -ఉదయగిరి : పట్టణంలో ప్రతిరోజు తాగునీటి సరఫరా చేయుటకు చర్యలు చేపట్టాలని ఆర్ డబ్ల్యూ ఎస్ సూపరింటెంట్ ఇంజనీర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ డబ్ల్యూ ఎస్ కార్యాలయంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్ తో సమీక్ష నిర్వహించారు. శనివారం నెల్లూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఉదయగిరి కి రోజు నీళ్ల ఇవ్వండయ్యా మీకు దండం పెడతా అని జెడ్పి కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ మాట్లాడిన తీరుకు వ్యక్త పరచిన ఆవేదనకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. మంత్రి కాకాణి.గోవర్ధన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ నారాయణన్ ఆదేశాల మేరకు నీటి సమస్యపై చర్చించేందుకు ఉదయగిరి కి వచ్చినట్లు ఎస్ఇ రంగనాథ్ తెలిపారు. ఆనకట్టలు నూతన బోర్లు వేయుట, బోర్లకు మరమ్మత్తులు చేసి నీటి లభ్యతను అన్వేషించుట గండిపాలెం నీరు ఉదయగిరి కి వచ్చే క్రమంలో సరఫరా సామర్థ్యాన్ని పెంచడం లాంటి అంశాలను చర్చించారు. ఇప్పటికీ నాలుగు రోజులకు ఒకసారి నీరు రావడం బాధాకరమైన విషయం అని సాధ్యమైనంతవరకు నీటి లభ్యత అవకాశాలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని ఎస్ ఈ హామీ ఇచ్చారు. నీటి పథకాల పునరుద్ధరణకుఎంపీ నిధులు కూడా కేటాయించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ తో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ లక్ష్మణ్, ఏఈ నరసింహులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకై అవగాహన

విశాలాంధ్ర - కావలి : టెలివిజన్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనకై అవగాహన కల్పించడం అభినందనీయమని కావలి రైల్వే ఎస్సై అరుణ కుమారి పేర్కొన్నారు. సోమవారం రాత్రి సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణం పెంకుల ప్యాక్టరీ చెరువు కట్ట గిరిజన సంఘం నందు టెలివిజన్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనకై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే ఎస్సై అరుణ కుమారి, సామాజిక కార్యకర్త ఎం.మాల కొండారెడ్డి, విచ్చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం తీసుకోవలసిన సూచనలు, సలహాలు తెలియజేశారు. బాల్య వివాహాలు జరిపిస్తున్న తల్లిదండ్రులకు, పూజారికి, బాల్య వివాహాలకు హాజరైన బంధువులు, స్నేహితులపై కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చిన్నవయసులో పెళ్లి చేయడం వలన అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని, ఎవరూ తమ పిల్లలకు చిన్నతనంలో పెళ్లి చేసి వారి బాల్యాన్ని చిదిమేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ సభ్యులు యమ్ అజిత్ బాబు, నేలటూరి శివ ప్రసాద్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ జె.వి శారద, విజయ్ భారత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై.కిరణ్ కుమార్, మహిళా కానిస్టేబుల్ పవిత్ర, వాలంటీర్లు యస్ డి.ఖదీర్, షేక్.రషీద్, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ సామాజిక వైద్యశాలను ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా వైద్యశాలల సమన్వయకర్త డాక్టర్ రమేష్ నాథ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11.45 గంటల సమయం లో జిల్లా అధికారి రిసెప్షన్ ఏరియా లో కనిపించడంతో సిబ్బంది అందరూ ఒక్కసారిగా అలెర్ట్ అయ్యారు. ముందుగా ఆరోగ్యశ్రీ కౌంటర్ దగ్గరకు వెళ్లి ఆరోగ్య మిత్ర ల ద్వారా అందుతున్న సేవల గురించి తెలుసు కున్నారు. ఆసుపత్రిలో కాన్పు అయిన గర్భవతులకు ప్రభుత్వం ద్వారా వస్తున్న ఆసరా పథకం డబ్బులు కొంత మందికి అందక పోవడానికి కారణాలు అడిగి తెలుసు కున్నారు.గర్భవతిగా ఉన్నప్పుడే ప్రతి గర్భవతి పేరు నవశకం పోర్టల్ లో ఉండేలా చూడాలన్నారు.తరువాత ఆసుపత్రి లోని ఓపి రూం లు, లాబరేటరీ, ఎక్స్రే రూం, అత్యవసర గది, కాన్పులు గది, ఆపరేషన్ గది, డిస్పెన్సరీ, వార్డులు అంతా తిరిగి రికార్డ్ లు పరిశీలించారు. ఇంజక్షన్ లు వేసిన తరువాత సిరింజ్ లు మరియు సూదులు డిస్పోస్ చేసే విధానం పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు .ఆసుపత్రిలో సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులు, బంధువులతో చిరునవ్వుతో మాట్లాడుతూ వారికి సేవ చేయాలి ఆయన అన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షచేసే కేంద్రంలో పరికరాలు కొరత ఎక్కువగా ఉందని. ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఉలవపాడు ప్రభుత్వ వైశాలలో పనిచేస్తున్న డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డిని. డిప్యూటేషన్ పై గుడ్లూరు ప్రభుత్వ వైశాలకు తరలించడం వలన. డాక్టర్ల కొరత ఎక్కువగా ఉందని అందువలన ఆ డాక్టర్ను కూడా వెనక్కి పిలిపించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వైశాలలో రక్తం నిలవ చేసే కేంద్రం ని ఆయన పరిశీలించారు. అది కూడా త్వరలో వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పా టు చేసి ప్రారంభించాలని ఆయన డాక్టర్లకు తెలిపారు. ఈ సందర్భంగావైద్యశాలకు వచ్చి పేషెంట్లకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.తదుపరి వైద్యశాలలో కాన్పు అయిన బిడ్డ తల్లికి ఆయన చేతుల మీదుగా డాక్టర్ సతీష్ బాబు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు కొరత ఉందని త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్య కూడా లేకుండా చేస్తానని ఆయన తెలిపారు. వైద్యశాలకు కావాల్సిన అన్ని పనికిరాలుత్వరలోనే పూర్తి స్థాయిలో అందే విధంగా చర్యలు చేపడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో. డాక్టర్ సతీష్ బాబు. డాక్టర్ శివానంద్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ శ్రీజా రెడ్డి. ఆరోగ్య మిత్ర నాగభూషణం. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రోజూ మంచి నీటి సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని ఇందిరమ్మ గ్రీన్ సిటీ హౌసింగ్ కాలనీకి ప్రతి రోజూ మంచి నీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం నాయకులు కాలనీ సంద ర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మేము సుమారు 13 సంవత్స రాలుగా ఇక్కడ నివాసముంటున్నామని, ఇప్పుడు మా కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, తొమ్మిది లైన్లు ఉన్నాయని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారని, ఈ ట్యాంకర్ ఒక్కొక్క వీధికి వచ్చేసరికి అయిదు రోజులు నుండి ఆరు రోజులు పడుతుందన్నారు. నీళ్లకు చాలా ఇబ్బందులు పడుతున్నామని, ట్యాంకర్లు పోసే నీళ్లు తాగేదా నికి పనికి రావని, స్నానం చేసిన ఒంటిమీద గుల్లలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు ఇక్కడికి వచ్చిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలుపుకున్నప్పటికీ మా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కనీసం త్రాగునీటి పరిష్కారం కూడా అధికారులు చూపలేదని తెలిపారు. అంతే కాకుండా ఈ కాలనీకి గతంలో మున్సిపల్ నీళ్ల పైపులైన్ ద్వారా వచ్చేవని ఇప్పుడు సుమారు మూడు సంవత్సరాల నుండి మున్సిపల్ నీళ్లు పూర్తిగా రావడంలేదని తెలిపారు. కరెంటు కూడా రోజుకి రెండు మూడు సార్లు పోతున్నందున అనేక సమస్యలతో సతమతమవుతున్నామని సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ నీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని, ఐదు ఆరు రోజులకు ఒకసారి నీటి ట్యాంకరు పోయడం చాలా అన్యాయం అని అన్నారు. ప్రభుత్వం, అధి కారులు ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా చేయలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ప్రచార ఆర్భాటాలు తప్ప ప్రజల సమస్యలు పరిష్కరించే దశలో లేరని, సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు కదిలి రావాలని, పోరాటాలు చేసి సమస్యను పరిష్కరిం చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై. కృష్ణమోహన్, సీపీఎం నాయకులు జి.మదుసూధన రావు, తలపల రత్నం, మస్తానయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

100 శాతం సర్వేలు పూర్తి చేయాలి: ఎంపీడీవో

విశాలాంధ్ర -ఉదయగిరి: మండలంలోని అన్ని సచివాలయాల్లో 100 శాతం సర్వేలను వాలంటీర్లు పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం కొండాయి పాలెం అప్పసముద్రం సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు బయోమెట్రిక్ హాజరు తప్పక నమోదు చేయాలన్నారు. కనీసం వాలంటీర్లు 50 శాతం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు . సచివాలయాలకు సమయపాలన పాటిస్తూ హాజరుకావాలని అదేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ప్రభుత్వ సర్వేలను ఎప్పటికప్పుడు 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఏఎన్ఎం ఆశావాలంటీర్ల సహ కారంతో ఆయుష్మాన్ భారత్ సర్వే త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శేఖర్ , నాగూర్, బి మండల కోఆర్డినేటర్ షేక్ గాజుల, ఇమ్రాన్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎయిడెడ్ వ్యవస్థకు జీవం పోసిన వ్యక్తి మాణిక్య రావు

విశాలాంధ్ర - కావలి : జవహర్ భారతి కళాశాల గణితశాస్త్ర అధ్యాపకులు, మాజీ ఎమ్మెల్సీ, ఎయిడెడ్ వ్యవస్థకు జీవం పోసి దానికి జవసత్వాలను కలిగించిన యం.జె. మాణిక్య రావు 97వ జయంతి కార్యక్రమం కళాశాల అధ్యాపక సంఘం మంగళ వారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రాజ గోపాల్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎయిడెడ్ ఉద్యోగి ఆత్మగౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉన్నాడంటే దానికి మాణిక్య రావు సుదీర్ఘ పోరాట ఫలితమేనని అన్నారు. అధ్యాపక సంఘ అధ్యక్షుడు పి.భాస్కరరావు ప్రసం గిస్తూ ఎయిడెడ్ అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది ప్రభుత్వ అధ్యాపకులతో సమానంగా జీతభత్యాలను తీసుకొం టున్నారంటే, ఉద్యోగ విరమణ తరువాత పెన్షన్ పొందుతున్నారంటే అది మాణిక్య రావు కృషి ఫలితమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరి డాక్టర్ డి.వెంకటరావు, కోశాధికారి డాక్టర్ టి. విశాలాక్షి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.మాల్యాద్రి, డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం నాయుడు,డాక్టర్ జే.కృష్ణప్రసాద్ బాబు, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్. చాంద్ బాషా, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రెజరర్లలకు మద్దతుగా బోగోలులో ర్యాలీ

విశాలాంధ్ర- బిట్రగుంట: ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళా రెజరర్లు నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతుగా బోగోలు మండల కేంద్రంలో వాకర్స్ అసోసియేషన్ జై భీమ్ అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసేందుకు ఎన్నో పథకాలు సాధించి పెట్టిన మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడడం అమానుష చర్య అన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం మీనమేసాలు లెక్కించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుర్ర చంద్రశేఖర్, సుందర రాజ్, రవిచంద్ర, సప్పిడి రవి, సాధనాల పుల్లయ్య, ఉమామహేశ్వరరావు, శ్యామ్ రసూల్ పాల్గొన్నారు.

సుధీర్ నాయుడు ని అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కావలి: ఇటీవల జరిగిన రెడ్ క్రాస్ ఎన్నికలలో జిల్లా వైస్ చైర్మన్ గా ఎన్నికైన దామిశెట్టి సుధీర్ నాయుడును కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కావలి ఆర్డీవో శీనానాయక్ లు అభినందించారు. మంగళవారం రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు ఎమ్మెల్యే, ఆర్డీవో లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సుధీర్ నాయుడును అభినందిస్తూ, కావలి రెడ్ క్రాస్ కు ఉన్న మంచిపేరును నిలబెట్టాలని అన్నారు. ఆర్డీవో వికె శీనానాయక్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలలోని ప్రభుత్వ శాఖలకు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ గా తగు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

కవులు రచనలపై అవగాహన

విశాలాంధ్ర-రాపూరు: స్థానిక గ్రంథా లయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం లో 16 వరోజు గ్రంథాలయ ఇంచార్జి అధికారి దనమ్మ విద్యార్థులకు పుస్తకం పఠనం, కథలు, నీతి వాక్యాలు, పద్యాలు,కవుల రచనల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాల య సహాయకులు వెంకటేశ్వర్లు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యా కానుక స్టాక్ పాయింట్ పరిశీలన

విశాలాంధ్ర - కలువాయి : కలువాయి మండల జగనన్న విద్యా కానుకకు4 ను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కావలి , కందుకూరు హరి ప్రసాద్, ఆకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సమగ్ర శిక్ష నెల్లూరు,జి. సుధీర్ బాబు పరిశీలించారు. జీవీకే పాయింట్ లో వచ్చిన వస్తువులను, వాటి నాణ్యతను పరిశీలించి మిగతా వస్తువులు కూడా త్వరలో వస్తాయని వాటిని పాఠశాల వారీగా కిట్లులను తయారుచేసి విద్యార్థులకు అందించవలనని తెలియ జేశారు. ఈ వస్తువుల పూర్తి బాధ్యత మండల విద్యాశాఖ అధికారి మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులదిఅని తెలియజేశారు ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు.

శానిటరీ ఇన్స్పెక్టర్ మృతి

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: నెల్లూరు నగర పాలక సంస్థలో శాని టరీ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న ముని శంకరయ్య (శంకర్) సోమవా రం రాత్రి మృతి చెందారు. శంకర్ గత కొన్ని రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారు. రెండు సార్లు గుండెపోటు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిరోజ్ల క్రితం ఇంటికి చేరుకున్నాడు. సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎంహెచ్ఓ వెంకట రమణయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్లు షరీఫ్, నరసింహా రావు తదితరులు పరామర్శించారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర -ఉదయగిరి: గ్రామ వాలంటీర్ల సేవలు అభినందనీయమని స్థానిక తాసిల్దార్ సాన శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని బిట్ 2 సచివాలయం లో వాలంటీర్ల వందన కార్యక్రమంలో తాసిల్దార్ పాల్గొని మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం కు ప్రజలకు మధ్య వారధిగా గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్న వాలంటీర్లను సన్మానించడం సంతోష దాయకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎప్పటికీ ఎప్పుడు ప్రజలకు వివరిస్తూ పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని అన్నారు వృద్ధ వికలాంగ వితంతు పెన్షన్ల ప్రతినెల 1 తేదీన తెల్లవారుజాము నుంచి పెన్షన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి 98 శాతం పెన్షన్ల పంపిణీ చేస్తున్నారని వివరించారు 50 ఇండ్లకు ఒక వాలంటీర్ ఏర్పాటు చేసి వారి సమస్యలు ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకుపోయేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు ఎలాంటి లంచాలు ఆశించకుండా సేవాదృకృథంతో వాలంటరీ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా నల్లిపోకు వందన వాలంటీర్ కు సేవ రత్న అవార్డు తోపాటు 20 వేలు అందజేశారు మిగతా వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డును ఇచ్చి 10, వేలు అందజేసి వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం జిల్లా కో ఆప్షన్ నంబర్ షేక్ గాజుల తాజుద్దీన్, మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ సుభాని, వార్డ్ మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర - కావలి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను అయిన నాటాలని హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భముగా కావలి పట్టణ అష్టలక్ష్మి నగర్ కారుణ్య కోచింగ్ సెంటర్ వద్ద హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఘనీభాష మాట్లాడుతూ ఇప్పుడు ఉష్ణోగ్రతలు కనీసం 48డిగ్రీలు నమోదు అవుతున్న తరుణం అని, అలాగే పుడమి తల్లిని రక్షించుకుందామన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు విరివిగా నాటాలన్నారు. ఈ కార్యక్ర మంలో కారుణ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కే.శివనారాయణ, కే.లత, సంస్థ సభ్యులు మారుబోయిన. నాగరాజు, షేక్ కరీముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడకు మనప్రభుత్వంలో నేదురుమల్లి

విశాలాంధ్ర-రాపూరు: వెంకటగిరి నిజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడకుమన ప్రభుత్వం కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజక వర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో విశ్రాంతి లేకుండా గడ ప గడపకు తిరిగి ప్రజల సమ స్యలు తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు చేరువయ్యారు. ఈ కర్యక్రమంలో భాగం గా మంగళవారం రాపూరు మేజర్ పంచాయతీ లోని బిట్ 3 సచివాలయ పరిధిలోనిరామి రెడ్డి పల్లి, నవాపేట,నవాపేట ఎస్ సి,ఎస్ టి కాలనిలో ఇంటిం టికి తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసు కొని సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా జగనన్న కు చెబుదాం కు ఫోన్ నెంబర్ 1902 కు ఫోన్ చెసి మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతాయని ప్రజలుకు తెలి పారు. ఈ కార్యక్రమము లో మండల ప్రముఖులు సుదీ ర్ఘ రాజకీయ కుటుంబీకులు పాప కన్ను

దయాకర్ రెడ్డి, వైఎస్ ఆర్ సీపీ రాష్ట్ర రైతు సంఘ కార్యద ర్శి బత్తినపట్టాభిరామి రెడ్డి, వైఎ స్ఆర్ సిపి సీని యర్ నాయకు లు శ్రీకిరెడ్డి రాఘవరెడ్డి చారి ట బుల్ ట్రస్ట్ చెర్మన్ శ్రీకిరెడ్డి శశిధర్ రెడ్డి, మండల జెసిఎస్ ఇంచార్జీ డి.ఎల్. నారాయణ రెడ్డి, ముని ప్రసాద్, కలపాటి మధుసూధన రెడ్డి,మర్లపుడి ప్రభాకర్ రెడ్డి, మండల తహశీల్ధార్ శుభాషిణి, మండల అభివృద్ధి అధికారి వీర్రాజు,మండల అన్నిశాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మనుబోలు పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర- మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు పోలీస్ స్టేషన్ మంగళ వారం ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో పలు రికార్డులను ఎస్పీ పరిశీలించారు. కొత్తగా నిర్మించిన రిసెప్షన్ భవనాన్ని పరిశీలించారు. ఎస్సై ముత్యా లరావు తో ఎస్పీ సమీక్షించారు. మనుబోలు పోలీస్ స్టేషన్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులు జారీ చేసే వరకు గుట్కాలు విక్ర యాలు చేసుకోవచ్చని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సుమారు గంటసేపు మనుబోలు పిఎస్ లో రికార్డులు పరిశీలించడం గమనార్హం.

పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లింపు - కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు

విశాలాంధ్ర - నెల్లూరు: బుచ్చిరెడ్డిపాళెం నగరంలో ప్రజా ఆరోగ్య సంరక్షకులు పారిశుద్ధ్య కార్మికులకు 13 నెలలు గా రావాల్సిన వేతన మొండి బకాయిలను శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చైర్ పర్సన్ మోర్ల సుప్రజ చొరవతో కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కృషితో చెల్లించడం జరిగింది.దింతో నగర పారిశుద్ధ్య కార్మికులు ఈరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు, చైర్ పర్సన్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంత రం పూలమాలలతో ముంచెత్తారు.కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కి రుణపడి ఉంటామన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం: సర్పంచ్

విశాలాంధ్ర -వలేటివారిపాలె: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అంద జేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని చుండి సర్పంచ్ ఇరు పని సతీష్ అన్నారు మంగళ వారం మండలం లోని చుండి గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు "వలంటీర్లకు వందనం కార్యక్రమం" చుండి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇరుపని సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్ , ఎంపీటీసీ చౌడుబోయిన యానాది హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధి దారు లకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా చిట్ట చివరి లబ్ధిదారునికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలు అందేవిధంగా ముఖ్యపాత్ర పోషిస్తున్న వలంటీర్ల వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు ముఖ్యమంత్రి మీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరువయ్యేలా చూచే బాధ్యత మీ అందరిపై ఉందని తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీతలందరికీ సన్మానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు తప్పని సరిగా అందేలా చూడవలసిన బాధ్యత వలంటీర్లు, సచి వాల య సిబ్బందిపై ఉందని తెలిపారు. వలంటీర్లు అందరూ మా సేవను గుర్తిం చి తమకు ఈ సన్మానం చేసినందుకు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ ఎంపీటీసీ యానాది, నాయకులు ఇరుపని అంజయ్య, కామినేని నరసింహం సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ జన్మదినం

విశాలాంధ్ర- నెల్లూరు సిటీ: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ జన్మదినం సందర్భంగా శాలువాలతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసి కేక్ కటింగ్ చేసి చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దిశ ఛైర్మన్ నిడి గుంట అరుణ, దళిత నాయకులు భీమతాటి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఢోకా లేదు

విశాలాంధ్ర -మనుబోలు: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి డోకా లేదని వ్యవసా య శాఖ మంత్రి కాక రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు మండలం చెర్లోపల్లి గ్రామానికి గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కు చేడి మాల బ్రదర్స్ అయినా బుజ్జి రెడ్డి(చిన్న రెడ్డి) వెంకటరమణారెడ్డి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో కానీ విని ఎరుగని రీతిలో మంత్రి రాకకు ఫ్లెక్సీలు, జెండాలు,బాణా సంచా మేళతాళాలతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకు తిరిగి మీకు సంక్షేమం అందుతుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మీడియాతో మంత్రి కాకాని మాట్లాడుతూ 2024లో 2019 వచ్చిన ఫలితాలు వస్తాయని మంత్రి కాకాని పేర్కొన్నారు. ఎవరు ఎన్ని వ్యాఖ్యలు చేసినా ఎవరి ఊహలు వారికి ఉంటాయని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం చేసిన వ్యాఖ్యలకు బదులిచ్చారు. ఎవరు ఎన్ని మాటలు మాట్లాడినా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి డోకా లేదని పేర్కొన్నారు. గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేశామని అన్నారు .చంద్రబాబు నాయుడుకు పేదలంటే లెక్కలేని తనమని విమర్శించారు .జగన్మోహన్ రెడ్డి నాయకత్వానికి నాయకులు కార్యకర్తలు అభిమానులు పుష్కలంగా ఉన్నారని అన్నారు. చెర్లోపల్లి గ్రామంలో సుమారు మూడున్నర కోటితో అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామంలోని ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే దానితో కాకుండా తమ సొంత నిధులు 15000 రూపా యలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపడతామని అన్నా రు .సర్వేపల్లి లో గడపగడపకు ప్రభు త్వం కార్యక్రమం నిర్వహిస్తే

గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నియోజకవర్గం లో పూర్తిస్థాయిలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, చిట్టమూరు అజయ్ కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ హరి గోపాల్ రెడ్డి ,ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, అక్కంపేట మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, నెట్ క్యాప్ చైర్మన్ దాసరి భాస్కర్ గౌడ్, అడపాల శివకుమార్ రెడ్డి, మన్నెమాల సాయి మోహన్ రెడ్డి, వెంకటసుబ్బ యాదవ్, చెముడు గుంట ఏడుకొండలు, గుమ్మ రవీంద్ర ,గుంజి రమేష్, అధికారులు తాహసిల్దారు లక్ష్మీ నారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిఇ చంద్రశేఖర్ ,హౌసింగ్ ఏఈ రవికుమార్, కార్తీక్ ,జహీర్ ఏపిఎం వనజాక్షి ,ఏపిఓ రాజమ్మ ,అంగన్వాడీ సూపర్వైజర్ ఆదినారాయణమ్మ ,సిఐ సంగమేశ్వర రావు ,ఎస్సై ముత్యాలరావు, అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కమిషనర్ కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. స్థానిక 35 వ డివిజన్ శానిటేషన్ మస్టర్ పాయింట్లను కమిషనర్ మంగళవారం ఉదయం 6.30 గంటలకు తనిఖీ చేసి శానిటేషన్ సిబ్బంది హాజరును కమిషనర్ పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయిన సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా డి.కె.మహిళా కళాశాల మార్గం, పోలీస్ పెరేడ్ మైదానం, ఆర్.టి.సి బస్టాండ్, మద్రాస్ బస్టాండ్, కలెక్టరేట్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం స్థానిక షాపుల నిర్వాహకులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ ప్రతీ దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్ బిన్ లను ఉంచాలని సూచించారు. డస్ట్ బిన్ లను వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించి షాపు ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే షాపు నిర్వాహకునికి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందించాలని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే గృహ వ్యర్థాలను అందించాలని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తా మని, చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా సేంద్రీయ ఎరు వులుగా మార్చి తిరిగి విని యోగం లోకి తీసుకురాగల మని కమిషనర్ ప్రజలకు వివరిం చారు. వాహనాలకు కాకుండా బహిరంగ ప్రదేశా ల్లో, డ్రైను కాలువల్లో చెత్తను వేయడం వలన దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు కలుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. స్థానిక మద్రాస్ బస్టాండ్ ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్టు సమీపంలో రోడ్డు వెంబడి విక్రయదారులు ఉదయం 7.30 గంటలకు పరిసరాలను శుభ్రం చేసి, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ఖాళీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా అన్ని ప్రధాన మార్గాలను ఉదయం 7 గంటలలోపు శుభ్రం చేసేలా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్తు బాల సాహిత్య సమ్మేళనంకు గుండాల

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్‌లో ఈ నెల 24,25 తేదీల్లో బాల సాహిత్య సమ్మేళనం కార్యశాల ఉభయ తెలుగు రాష్ట్రాల బాల సాహితీవేత్తలు, బాలకవులకు బాలగేయాలు, బాలల కథలు తదితర అంశాలపై చర్చా గోష్ఠులు తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివా రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య ఆధ్వర్యంలో శాంతా బయోటెక్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డి సౌజన్యంతో వారి మాతృమూర్తి కోడూరి శాంతమ్మ స్మృత్యర్థం నిర్వహిస్తున్న కార్యక్రమంలో తొలిరోజు ద్వితీయ సదస్సు బాల సాహిత్యం నాడు నేడు" చర్చాగోష్టిలో నెల్లూరు కేఎన్ఆర్‌నగర పాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, కవి, రచయిత, గేయ రచయిత, శతాధిక బాల గేయ రచయిత,బాల సాహితీవేత్త గుండాల నరేంద్ర బాబు నెల్లూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రసంగించనున్నారు. గుండాల నరేంద్ర బాబు రాసిన శతాధిక బాల గేయాలు పలు ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో ప్రచురింపబడిన విషయం విదితమే. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రి, ప్రముఖ బాల సాహితీ వేత్త డాక్టర్ అమరవాది నీరజ అధ్యక్షులుగా, ప్రముఖ బాల సాహితీవేత్త డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు సమన్వయ కర్తగా వ్యవహరించనున్నారు.

జనసేన అధినేత పవన్ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

విశాలాంధ్ర- రాపూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రికావాలని ఆత్మకూరు నియోజక వర్గం అనంతసాగరం మండలంకు చెందిన జనసేన యూత్ నాయకులు కంటే శ్రీనివాస్ భరత్ సోమవారం ఉదయం 7 గంటలకు అనంతసాగరం నుండి బయలుదేరి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని తిరుమ లకు పాదయాత్ర బయలుదేరారు. సోమవారం రాత్రి 7 గంటలకు పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీ నరసింహుని దర్శించుకొని ,రాత్రి బయలుదేరి రాపూరు కి ఉద యం 8 గంటలకు రాపూరుకు చేరుకోగా రాపూరు మండల జనసేన నాయకులు మండల అధ్యక్షులు పొట్టేళ్ల పెంచలస్వామి, మండల అధ్యక్షురాలు వీర మహిళ కొండాపురం కస్తూరి, జల్లెల రాజేష్, భట్టు పెంచలయ్య, సీనియర్ జనసేన, మండల యువకులు కేశవ సెట్టి నాగేశ్వరావు, శ్రీనివాస్ భారత్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం రాపూరు నుండి తిరుమలకు బయలు దేరారని వీర మహిళ కొండాపురం కస్తూరి , మండల అధ్యక్షులు పొట్టేళ్ల పెంచలస్వామి తెలిపారు.

నేడు వాలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవం: ఎంపిడిఓ

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండల కార్యాల యం ప్రాంగణంలో బుధవారం వాలంటీర్స్ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని మండలం లో సేవా వజ్ర-1 బోజ్జన పల్లి గ్రామ వాలంటీరుకు 30 వేలు, సేవా రత్న- ఐదుగురికి ఒక్కొక్కరికి 20 వేలు, (రాపూరు సచివాలయం 2,3 సంక్రాంతి పల్లి, గోను పల్లి, బోజ్జన పల్లి గ్రామ వాలంటీర్లకు)సేవా మిత్ర ఒక్కొక్కరికి 10 వేలు, 243 మంది వాలంటీర్లు కు పుర స్కారాలు అందజేసే కార్యక్ర మమంలో ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజ కవర్గ సమన్వయ కర్త నేదురు మల్లి రాంకుమార్ రెడ్డి, స్థానిక సంస్థల ఎంఎల్‌సి రాపూరు స్థానికులు మేరీ గా మురళీధర్, రాపూరు మండల ప్రముఖులు, సుదీర్ఘ రాజకీయ కుటుంబ సభ్యులైన పాపకన్ను బాబాయి అబ్బాయిలైన ఏఎంసి మాజీ చైర్మన్ పాపకన్ను మధుసూధనరెడ్డి, పాపకన్ను దయాకర్ రెడ్డి, సొసైటి చైర్మన్ పాపకన్ను వేణుగోపా ల్ రెడ్డి పాల్గొంటున్న కార్యక్రమంలో మండల జెసిఎస్ ఇన్‌చార్జి డి.ఎల్. నారాయణ రెడ్డి పాల్గొ నే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ వాలంటీర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులులు ప్రత్యేక ఆహ్వానంతో హాజరు కావాలని ఎంపిడిఓ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

తెల్లపాడు వద్ద ఇళ్ల స్థలాలు వద్దు

- ఎంపీపీ దృష్టికి తెచ్చిన గృహ లబ్ధిదారులు

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలో నివసిస్తున్న పేదలమైన తాము కూలి పనులు, షాపుల్లో పనులు, బీడీ పని చేసుకొని బతుకు తున్నామని జగనన్న కాలనీలు ఏఎస్ పేటలో కాకుండా పక్క పంచాయతీలోని తెల్లపాడు వద్ద మంజూరు చేశారని అక్కడకు వెళ్లి తాము నివాసాలు ఉండలేమని తమకు ఏ ఎస్ పేటలోనే ఇల్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు ఎంపీపీ బి పద్మజా రెడ్డి కి మొరపెట్టు కున్నారు. ఆ మేరకు వారు ఎంపీడీవో కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేశారు. 2020లో జగనన్న కాలనీలు మంజూరు చేస్తామని పేదలను గుర్తించారని తెలిపారు. మండల కేంద్రంలో సుమారు 300కు పైగా పేదలను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారని అయితే ప్రభుత్వ స్థలం లేదన్న కారణంతో పక్క పంచాయతీలోని చెరువులో తట్టు చౌడు భూముల్లో లేఔట్లు వేశారని ఆమె దృష్టికి తెచ్చారు. అప్పట్లో తమకు పట్టాలు వద్దని అధికారులకు తెగేసి చెప్పామని అయినా వారు బలవంతంగా తమకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. చౌడు భూముల్లో ఇల్లు నిర్మాణం ఇబ్బంది కరంగా ఉంటుందని అక్కడ నుంచి నిత్యం ఏఎస్పేటకు వచ్చి వెళ్లాలంటే వాగు దాటి రావాల్సి ఉందని వాపోయారు. ప్రభుత్వం పేదల కోసం లక్షలాది రూపాయల వ్యయంతో ఇల్లు నిర్మిస్తుంటే తమకు ఉపయోగం లేని చోట కొందరు అధికారులు, నాయకులు వాళ్ల స్వార్థం కోసం పక్క పంచాయతీలో ఇల్లు మంజూరు చేస్తామనడం ఎంతవరకు సమంజసం అన్నారు. అందువల్ల ఏఎస్పేట పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేసి ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని లబ్ధిదారులు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఆమె లబ్ధిదారులకు తెలిపారు.

అంగన్‌వాడీ స్కూల్‌కి ఆఫీస్ బెంచ్, కుర్చీలు వితరణ

విశాలాంధ్ర -మనుబోలు: శ్రీ సేవానాధం ట్రస్ట్ వ్యవస్థాపకులు మాచిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి సౌజన్యంతో శ్రీ సేవానాధం ట్రస్టు సభ్యులు స్థానిక కోదండ రాంపురం సీఎం నగర్ అంగన్వాడి స్కూల్లో ఆఫీస్ బెంచ్, నాలుగు కుర్చీలను ఇచ్చారు. అంగన్వాడి స్కూల్ టీచర్ అంగన్వాడి స్కూల్లో కుర్చీలు, బెంచుల కొరత ఉందని చెప్పగానే మాచిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి కి తెలిపారు. ఆయన వెంటనే స్పందించి స్కూల్‌కి ఆఫీస్ బెంచ్ ఒకటి, నాలుగు కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక చంద్రమౌళి నగర్ వాసులు , అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలు, తల్లులు, గర్భవతులు అందరూ వచ్చారు. వారికి ట్రస్ట్ సభ్యులు స్వాగతం తెలియజేసి వాళ్లకి జ్యూస్, చల్లటి మంచినీరు, బిస్కెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు మండలం అంగనవాడి సూపర్వైజర్ రమణమ్మ, సీఎం నగర్ అంగన్‌వాడీ స్కూల్ టీచర్ సుగుణమ్మ , శ్రీ సేవానాధం ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఇందుకు సీఎం నగర్ వాసులు, గర్భవతులు శ్రీనాథ్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయంను తనిఖీ చేసిన జెసి

విశాలాంధ్ర-ముత్తుకూరు: నారికేల్లపల్లి సచివాలయాన్ని జేసీ కూర్మనాథ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగు లను శాఖల వారీగా వారు చేస్తున్న విధి విధానా లను గురించి అడిగి తెలుసు కున్నారు. రికార్డులను తనిఖీ చేసి రికార్డులను సక్రమంగా రాస్తున్నా రా లేదా? విధులకు సక్రమంగా హాజరవుతున్నారా.. లేదా? అని కూడా సచివాలయ కార్యదర్శి యస్ దానిభాషని అడిగి తెలుసు కున్నారు. రికార్డు లను తనిఖీ చేశారు. జగనన్న భూ సమగ్ర సర్వే స్టోన్ ప్లాంటేషన్ సక్రమంగా జరిగిందా? లేదా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ బాబు, వీఆర్వో పోలయ్య, మండల సర్వేయర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

'నాడు - నేడు' పనులను వేగవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర - నెల్లూరు కార్పొరేషన్: 'నాడు - నేడు" అభివృద్ధి పనులను వేగవంతం చేసి పాఠశాలల పున:ప్రారంభం నాటికి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక మహాత్మా గాంధీ నగర్ ఉర్దూ పాఠశాల, మున్సిపల్ పాఠశాల, పడారుపల్లి మున్సిపల్ పాఠశాలల్లో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అదనపు తరగతి గదులతో పాటు నూతన మరుగుదొడ్ల నిర్మాణా లను జూన్ 12 వ తేదీ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. నిర్మాణ పనులన్నీ అత్యంత నాణ్యతతో, పారదర్శ కంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం డ్రైవర్స్ కాలనీలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ కాలనీలోని మున్సిపల్ పార్కును కమిషనర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అధికారిఅలీ, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్ కుమార్, ఈఈ శేషగిరిరావు, ఏఈ అర్చిత, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాలు చేయాలి

విశాలాంధ్ర-ముత్తుకూరు: సమాజంలో యువత సేవ కార్యక్రమాలను చేయడం వల్ల వారు చెడు మార్గాల బాట పట్టకుండా ఉంటారని అందువల్ల వారికి, వారి కుటుంబానికి, సమాజా నికి ఎంతో మేలు చేకూర్చిన వారవుతారని ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కృష్ణ పట్నం గ్రామ సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పై సంస్థ అధ్యక్షులు భవాని శంకర్ ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. గత ఏడాది కూడా ఇదే సమయంలో ఇక్కడ చలివేంద్రమును తాను ప్రారంభించాను అని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే పోయే వారికి ఈ చలివేంద్రం ఎంత ఉపయోగకరంగా మారు తుందన్నారు. యువత ఈ ప్రదేశంలోని క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం జరుగు తుందని అలాంటి వారికి కూడా ఈ చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. యువత సేవా కార్యక్రమాలు చేయడం వల్ల సమాజంలో ఎంతో గుర్తింపు పొందుతారని, అది వారి భవిష్యత్తు కు బాటిల్ వేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం గ్రా మ సమస్యల సాధన సమితి సభ్యులు హరిబాబు, నాగార్జున, రాజా, వివేక్, పవన్ పాల్గొన్నారు.

ఖాళీ జాగా కనిపిస్తే వేసేయ్ పాగా !

విశాలాంధ్ర- వరికుంటపాడు: వరికుంట పాడు మండలం కృష్ణంరాజు పల్లె (దక్షిణ) లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 245/8 సర్వేనెంబర్ గల ఇరిగేషన్ భూమిని కొంద రు ఆక్రమణదారులు ఆక్రమించుకొని చుట్టూ కంచె వేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ గాని విద్యాశాఖ అధికారులు కానీ స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులు అక్రమణదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు.

ఘనంగా ఎంఎల్‌సి మేరిగ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు స్థానికులు ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తన 55వ జన్మదిన వేడుకలు గూడూరు పట్టణం లోని సనత్ నగర్ లోని తన నివాసంలో మంగళవారం ఉదయం 10 గంట లకు నాయకులు, కార్యకర్తలు, ఆత్మీ యు లు, మిత్రులతో, బంధువుల మధ్య రంగరంగ వైభవంగా జన్మ దిన వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలో రాపూరు మండల నాయ కులు, మిత్రులు, రాపూరు మం డల ప్రముఖులు వైసీపీ సీనియర్ నాయకులు శ్రీకి రెడ్డి, రాఘవరెడ్డి, చారిటబుల్ ట్రస్ట్ చెర్మన్ శ్రీకిరెడ్డి శశిధర్ రెడ్డి, రాపూరు ఎఎంసి వైస్ చెర్మన్ గంగిశెట్టి వేంకటేశ్వర్లు, మండల జెసిఎస్ నాయకులు డి.ఎల్. నారాయణ రెడ్డి, మైనారిటీ నాయకులు డాక్టర్ ఖాదర్ బాషా, సీనియర్ వైసిపి నాయకులు గుండురాఘవయ్య, ఆల్తాఫ్ బెగ్, ఆరీఫ్, పిఎల్ఆర్ క్రషర్ వెంకట్రావు, ఈద్గా చైర్మన్ పఠాన్ బాబు (కోకిల), షాది మంజిల్ చైర్మ న్, వైస్ చైర్మన్ గౌస్ పీర్, చిన్న మస్తాన్, భూపతి జయరామ య్య, డి.వి.రమణయ్య, వరబాబు పాల్గొన్నారు.

ఎగుమతి కి పనికి రాక..స్థానికంగా కొనక !

- మంగు మచ్చల వల్ల నష్టాల్లో మామిడి రైతులు
- అకాల వర్షాల వల్ల మామిడి రైతు కుదేలు
- చిరువ్యాపారులే దిక్కు
- ఉలవపాడు వైపు కన్నెత్తి చూడని ఎగుమతి దారులు

విశాలాంధ్ర - ఉలవపాడు : అకాల వర్షాలు ప్రతికూల వాతావరణం ఈఏడాది మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది ఎన్నో ఆశలతో ఎక్కువ పెట్టుబడితో సాగుచేసిన రైతులకు నిరాశ మిగిలింది. ఉలవపాడు మండలంలో మామిడికి పెట్టింది పేరు. ఎక్కువ శాతం మామిడి తోటలు ఉన్నాయి పలు కారణాలవల్ల ఈ ఏడాది కాపు తక్కువగా ఉన్న కురిసిన అకాల వర్షాల వల్ల ఉలవపాడు మామిడికాయలకు నాణ్యతకు మచ్చపడింది. దీనివల్ల ఎగుమతికి పనికిరాక స్థానికుల కొనక రైతులు నానా అవస్థలు ఎదుర్కొం టున్నారు దీనివల్ల గిట్టుబాటు ధరదొరకడం లేదని రైతులు గుండెలు బాదుకుంటుంటారు ఉలవపాడు అనగానే గుర్తొచ్చే బంగినపల్లి మామిడికాయలపై అధిక భాగం మంగులు మచ్చలు ఏర్పడి నాణ్యత బాగా దెబ్బతింది. గతంలో ఎకరాకు మూడు నుండి నాలుగు టన్నులు దిగుబడి వచ్చేది అయితే ఈ సంవత్సరం చీడపీడల కారణంగా ఒకటి రెండు టన్నులకు మాత్రమే పరిమితమైంది సరే దక్కిన వరకు చాలు అని రైతు సరిపెట్టుకునే లోపే కురిసిన అకాల వర్షం మామిడి పంటను మరింత దెబ్బతీసింది. దీనివల్ల పంటనాణ్యత లేకపోవడం, కాయల్లో పురుగులు ఉండటంతో వ్యాపారాలు సరిగా ఆసక్తి చూపడం లేదు. దానికి తోడు నూజివీడు మామిడి ఇంకా మార్కెట్లో ఉండటంతో విజయవాడ, హైదరాబాదు నుండి వచ్చే వ్యాపారాలు అక్కడే సరిపెట్టుకుంటున్నారు. నూజివీడు లో మరో 10 రోజుల లో కోతలు ముగియ నుండ టం తో తరువాత అయినా వ్యాపారులు ఉలవపాడు మార్కె ట్ వైపు ఆసక్తి చూపితే కొంత ధరలు పెరుగుతాయని ఆశ గా ఎదురు చూస్తు న్నారు. అదిలా ఉంటే ఎదురుచూడటం వృథా గా భావించిన కొందరు వచ్చిన వరకు జమ అని పండిన పంట ను ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న జ్యూస్ ఫ్యాక్టరీ లకు తక్కువ ధరకే విక్రయి స్తున్నారు. కొందరు రైతులు స్వయంగా మార్కెట్ కి తెచ్చి వేటపాలెం చీరాల నుండి వచ్చే చిన్న చిన్న వ్యాపారులకు, ఉలవపాడు బైపాస్ లో ఏర్పాటు చేసిన అంగళ్లకు తక్కువ ధరలకే విక్రయించి చేతులు దులుపుకుంటున్నారు.

మల్లికా పెంచలయ్యకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు మేజర్ పంచా యతీలోని మల్లమ్మ గుంటకు చెందిన నిరు పేద గిరిజన కుటుంబీకులు మల్లికా పెంచలయ్య కుమారుడు, పెం చల నరసింహ కొన్ని రోజులక్రితం కాళు కాలడంతో అతని కుటుంబానికి మంగళ వారం జనసేన కలువాయి మండల నాయ కులు శ్రీరామ్ మనోహర్ ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువులు ను పంపిణీ చేశారు. రాపూరు మండల, జన సేన మండల అధ్యక్షులు పొట్టేళ్ల పెంచల స్వామి, మండల అధ్యక్షులు, వీరు మహిళ కొండాపురం కస్తూరి, నాయ కులు జల్లెల రాజేష్ ,భట్టు పెంచలయ్య, నాగేశ్వ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందటంలో వాలంటీర్లు పాత్ర కీలకం

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడు లోని గ్రామ పంచాయతీ కార్యాలయం లో సచివా లయం -1 వాలంటీర్లకు ఎంపీడీఓ చెంచ మ్మ అధ్యక్షతన సన్మాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలువురు వాలంటీ ర్లు సేవా భావం తో తమ విధులు నిర్వహించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూశారని అలాంటి వారిని సన్మానించుకోవడం మంచి ఆరోగ్య కరమైన సందేశంగా అందరూ వాలంటీర్లు స్వీకరించి మెరుగైన సేవలు అందించి మండ లాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఉలవ పాడు -1 సచివాలయం లో మొత్తం 20 మంది వాలంటీర్లు ఉండగా అందులో ఉలవపాడు సర్పంచ్ కుమార్తె మానికల శిరీష కు సేవా రత్న రాగా మిగతా వారికి సేవా మిత్రలు వచ్చాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సచివాలయ కన్వీనర్లు, సచి వాల య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి: ఎంపీడీవో

విశాలాంధ్ర- నెల్లూరు: గ్రామా లలోని ప్రజలు తాగునీ టికి ఇబ్బంది లు పడ కుండా ప్రజాప్రతినిధులు సహకరించా లని కొడవలూరు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యా లయంలో మంగళవారం యంపిపి గాలి జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భం గా శాఖల వారిగా అధికారులు వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధక్షులు మారంరెడ్డి పార్వతమ్మ, సర్పంచులు నాగిరెడ్డి సునీల్ కుమార్, మారంరెడ్డి రంగారెడ్డి, ఏపిఓం రుక్మిణి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కుమారుడు మృతి

- పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి

విశాలాంధ్ర- నెల్లూరు సిటీ: ఒక ఉత్తమ లెక్చ రర్‌గా కాంట్రాక్ట్ లెక్చ రర్స్ అసోసియేషన్ కు ఎన్నో సేవలు అంది స్తున్న రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దయాకర్ కుమారుడు గత వారం అకాల మరణం చెం దడం తోఎమ్మెల్సీ పర్వ త రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మచిలీపట్నం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చదువుల్లో మేటిగా రాణిస్తూ ఇటీవల ఐఐటీ మైన్స్ లో కూడా 96 పర్సంటైల్ సాధించిన అబ్బాయి దురదృష్ట వశాత్తు రైలు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని విచారం వ్యకం చేశారు. వారి తల్లి దండ్రులకు భగవంతుడు మనో ధైర్యం కలిగించాలని ప్రార్థించారు.

ఉద్యమాలు చేస్తే హౌస్ అరెస్టులా?

ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి హౌస్ అరెస్ట్ ను ఖండించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రూరల్ ఎమ్మెల్యే క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మించా లని చేస్తున్న ఉద్యమానికి సీపీఐ నాయకులు మద్ద తు తెలిపారు. ఈ సందర్భం గా సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, షానవాజ్ మాట్లా డుతూ రూరల్ నియోజక వర్గం లో నెలకొన్న సమస్యలపై రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి దశల వారీగా సమస్యల పై పోరాటాలు చేస్తున్నారు. అందులో భాగంగానే క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మించా లని చలో గాంధీనగర్ పిలుపు నిచ్చారు. కానీ పోలీసులు శ్రీధర్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యం అని, గతంలో శ్రీధర్ రెడ్డి పొట్టే పాలెం కలుజు నిర్మాణం కోసం అన్ని పార్టీలను కలుపుకొని పోరాటం చేయాలని నిర్ణయిస్తే అప్పుడు కూడా హౌస్ అరెస్ట్ చేశారు నిరసనలు, పోరాటాలు రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా కాలరాస్తు_న్నారన్నారు. హౌస్ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని, ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి క్రిస్టియన్ కమ్యూనిటీ హాలును పూర్తి చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

28న మాదిగల ఆత్మీయ సమావేశం

రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ పందింటి సుబ్బయ్య

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లాలో మాదిగలు దీర్ఘకాలికంగా ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారంతో పాటు రాజకీయ వాటా పై న్యాయ బద్ధంగా ఉద్య మించేందుకు ఈనెల 28న మాదిగల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ పందింటి సుబ్బయ్య మాదిగ తెలిపారు. నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి7 దశాబ్దాలు దాటుతున్నా జిల్లాలో మాత్రం మాదిగల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. మాదిగలకు సరైన రాజకీయ ప్రాధాన్యత లేదని, రాజకీయ పదవుల్లో మాదిగలకు న్యాయబద్ధంగా తరలించిన వాటా మాత్రం దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక నిర్ణయించేందుకే ఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నా మ న్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు1/1లో దళితులకు సంబం ధించి భూములనుదళితులకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఎస్సీ ఎస్టీ సేవా సమితి అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని సంఘాలు, రాజకీయ పక్షాల్లో ఉన్న మాదిగలు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పల్లాల శ్రీనివాసులు, జాలాది శ్రీనివాసులు, కుడుముల సుబ్బారావు, సునీత, రఘు, చిన్నయ్య,బద్దెపూడి వెంకట్ రావు, సాల్మాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిసిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రకాశం జిల్లా సింగరాయకొండ లో వైసిపి రాష్ట్ర బాధ్యులు జాలిరెడ్డి అమృతా కళాశాలలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యా యులు తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ తో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి పలు అంశా లను చర్చించారు. అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వారికి తెలిపారు.

అదాల ప్రభాకర్ రెడ్డ్కకాకాని గోవర్ధన్ రెడ్డి క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వ్యతిరేకమా ? అనుకూలమా ?

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్‌లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని పోరుబాట కార్యక్రమాన్ని గాంధీ నగర్ లోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కి కేటాయించిన స్థలం వద్ద రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేపట్టదలిచారు. అయితే తెల్లవారుజామునే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి, ఎవ్వరిని కలవనీకుండా చేశారు. ఈ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని అరెస్టు చేసినా, పోలీసుల ద్వారా అడ్డంకులు కలిగించినా ఈ కార్యక్రమానికి మద్దతు తెలపడానికి ప్రతి చర్చి నుండి ఇటుకరాయి తీసుకువచ్చిన క్రిస్టియన్ పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులకు నాయకులకు ప్రతి ఒక్కరికి పాదాభివందనం అని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలని కలెక్టర్ నికోరగా, 2021వ సంవత్సరం జులై నెల, 3వ తేదీన కలెక్టర్ ఆదేశాలమేరకు నెల్లూరు

రూరల్ తహశీల్దార్ స్థలాన్ని అడ్వాన్స్ పొసెషన్ ఇచ్చారని గిరిధర్ రెడ్డి తెలిపారు. అధికార పార్టీ నెల్లూరు రూరల్ ఇంఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వ్యతిరేకమా ? అనుకూలమా ? వెంటనే ఈ విషయమై క్రిస్టియన్ సోదరులకు స్పష్టం చేయాలన్నారు. మీరు మౌనంగా ఉంటే క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మీరు వ్యతిరేకమని క్రిస్టియన్ సమాజం భావించవలసి వస్తుందని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ లో ప్రజా ఉద్యమాలు చేస్తోనో, అక్రమ అరెస్టులు చేస్తేనో, కేసులు పెడితేనో భయపడే వారు కాదు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అయన అనుచరులు అన్నారు. అన్ని తెలిసి, అన్నింటికీ తెగించి బయటకు వచ్చామని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి, తాటి వెంకటేశ్వర్ల రావు, క్రిస్టియన్ పాస్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ మణిదీపిక

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: రోజురోజుకి ఎండ తీవ్రత పెరుగుతోందని వేసవికాలంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ ఈద మణిదీపిక తెలిపారు. మంగళవారం వలేటివారి పాలెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో విశాలాంధ్ర విలేకరితో ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల వివిధ పనులపై బైటకు వెళ్లే సమయంలో తరచుగా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వణుకు పుట్టడం, కలవరింతలు, ఫిట్స్, తలనొప్పి, కళ్ళు తిరగడం, నీరసం, నాలుక ఎండిపోవడం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. ఎక్కువగా 65 సంవత్సరాలు దాటిన వారికి, గర్భవతులకు, పసిపిల్లలకు, గుండెపోటు, రక్తపోటు ఉన్నవారికి వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న సమయంలో బైట తిరగరాదని, మద్యం సేవించకూడదని, రోడ్లమీద చల్లని రంగుల పానీయాలు తాగకూడదన్నారు. మాంసాహారం తగ్గించాలని, తాజా కూరగాయలను ఆహారంలో తీసుకోవాలని తెలిపారు. తప్పని పరిస్థితిలో బైటకుపోయే సమయంలో టోపీ లేదా రుమాలు వాడాలన్నారు. వడదెబ్బని నివారించడానికి నీరు, పళ్లరసాలు, కొబ్బరినీళ్లు, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. భోజనం తక్కువ గా తిని మంచినీళ్లు ఎక్కువగా తాగాలని తెలిపారు. నలుపు రంగు బట్టలకు బదులు లేత రంగులో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు ఇంటి వద్దనే ఉండాలని తెలిపారు.ఎవరికైనా వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్సగా నీడ ఉన్నప్రదేశానికి చేర్చాలని, చల్లని గాలి తగిలే విధంగా చూడాలని, ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓఆర్ ఎస్ తాగించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారిని వీలైనంత త్వరగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని రావాలన్నారు. మండలంలోని ప్రజలు ఉపాధి, హామీ కూలీలు ఉదయం 11 గంటల లోపు పనులు ముగించుకొని ఇంటి వద్దనే ఉండాలని ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు.

సిలికా అక్రమ మైనింగ్‌తో వేల కోట్ల దోపిడీ

- ఏపీలో ఇదొక భారీ స్కామ్
- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: బ్రిటీష్ పాలకుల కంటే దారుణంగా జగన్ రెడ్డి బాదుడు, మీ బిడ్డ..మీ బిడ్డ అంటూనే ప్రజల గొంతు కోస్తారా? ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మికి పట్టిన గతే రేపు మైనింగ్ అధికారి వెంకటరెడ్డికి పట్టబోతోందని, పేదల భూముల్లోనూ సిలికా దోచేస్తుంటే అధికారులు ఎన్వోసీలు ఇవ్వడం సిగ్గుచేటని, ప్రభుత్వ అధికారుల మనుకుంటున్నారా? వైసీపీ కార్యాలయాల్లో గుమస్తాలుగా ఫిక్స్ అయ్యారా?' అని టీడీపీ అధికారంలోకి రాగానే ఈ పాపంలో భాగస్వాములందరూ ఫలితం అనుభవించడం ఖాయం అని, మైనింగ్ లీజుదారులు చట్టప్రకారం సిలికా పర్మిట్లకు దరఖాస్తు చేసి నిబంధనల ప్రకారం మైనింగ్ చేసేందుకు ముందుకొస్తే అఖిల పక్షంగా మేం అండగా నిలిచేందుకు సిద్ధం అన్నారు. చిల్లకూరు, కోట మండలాల్లో సిలికా అక్రమ మైనింగ్ జరిగిన భూములు, యార్డులను పరిశీలించిన అనంతరం మీడియాతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సిలికా మైన్ల పరిశీలన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, శీలం కిరణ్ కుమార్, వేనాటి సతీష్ రెడ్డి, బొమ్మి సురేంద్ర, రాధా కృష్ణమనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గాలి రామకృష్ణా రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, గుమ్మడి రాజా యాదవ్, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, తలచేరు మస్తాన్ బాబు, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు మావిల్లపల్లి శ్రీనివాసులు నాయుడు, పొన్నూరు రామకృష్ణయ్య, భాస్కర్ రెడ్డి,మునిస్వామి, ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, గణపర్తి కిషోర్ నాయుడు, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, బిల్లు చెంచురామయ్య, చిరంజీవి, జనసేన నేత చంద్రశేఖర్, సీపీఐ నాయకుడు కాలేషా, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. సోమిరెడ్డి కామెంట్స్, గూడూరు డివిజన్ లో లభించే అరుదైన, నాణ్యమైన సిలికా అక్రమ మైనింగ్‌తో వేల కోట్లు దోచేస్తున్నారు..ఇప్పటికే రూ.3 వేల కోట్లు దోచేశారు. ఈ రోజు తమ పర్యటనలో ఏ యార్డులో చూసినా లక్ష నుంచి ఒకటిన్నర లక్షల టన్నుల సిలికా కనిపి స్తోంది. ఈ లక్షల టన్నుల సిలికాను తీసుకుని పైకెళతారా? మరీ ఇంత దురాశా.. రూపాయికి 10 పైసలు పన్ను వేస్తేనే దేశమంతా తిరగబడి బ్రిటిష్ పాలకులను తరిమి కొట్టారు. ఈ రోజు రూపాయికి 90 పైసలు పన్ను వేస్తున్న జగన్ రెడ్డిని ఏం చేయాలని ప్రశ్నించారు. మైన్ల యజమానులకు టన్ను సిలికాకు రూ.100 చెల్లిస్తూ రూ1485కి అమ్ముకుంటున్నారన్నారు. బల్లవోలు తదితర గ్రామాల్లో ప్రభుత్వ అసైన్మెంటు భూములను అనాదిగా సాగు చేసుకుని జీవనాధారం పొందుతున్న పేద రైతుల మెడపై కత్తి కట్టి ఖాళీ చేయిం చార న్నారు. టన్నుకు రూ.30కి వారికి చెల్లించి ఆ సిలికాను కూడా రూ.1485కి అమ్మి దోచు కుంటున్నారు. ఇదేందని ప్రశ్నించిన 33 మంది దళితులపై కేసులు పెట్టార న్నారు. సిలికా అక్రమ మైనింగ్ చేస్తోంది జగన్ బినామీలే అన్నారు. వాళ్లంతా నెలకు రూ.20 కోట్లు లోటస్ పాండ్ లో చెల్లిస్తున్నారు. మధ్యలో బ్రోకర్లు మరో రూ.5 కోట్లు భోంచేస్తున్నారు. ఇదంతా ఎవరి సొత్తు అనుకుంటున్నారు. పులి వెందులలో మీ తాత ఇచ్చిపోయిన ఆస్తులు అను కుం టు న్నారా? అని ప్రశ్నించారు. ఇంత దోపిడీ బహిరంగంగా జరుగుతుంటే ఏమి లేదంటూ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ వెంకటరెడ్డి మైనింగ్ మాఫియాను వెనకేసు కొస్తున్నారన్నారు. గూడూరు డివిజన్ లో మైనింగ్ మాఫియా అక్రమాలు, ఆగడాలను, అరాచకాలను ప్రత్యక్షంగా చూపిస్తానని ఆయనకు సవాల్ విసి రాను..ఈ రోజుకు సమాధానం లేదు ఓబులాపురం మైనింగ్ స్కాంలో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి జైలుకు పోయి బయటకు వచ్చారు. ఆమెకు పట్టిన గతే భవిష్యత్తులో వెంకటరెడ్డికి పట్టబో తోందన్నారు. గూడూరు ఆర్డీఓకు కూడా కళ్లు కనిపించడం లేదు. డీకేటీ పట్టాలు రద్దుచేసి వామన బ్యాచ్ కు నో అబ్జెక్ష న్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. మరీ ఇంత బరితెగింపా? అని ప్రశ్నించారు.